# వింత భాష

విజయనగరం వెళ్లడం నాకదే మొదటిసారి. మా అక్కను నా పూర్వివ్వడం చేత ఒకసారి చూచి వద్దామని బయల్దేరాను. అది వేసవి కాలం. ఎండలు దంచేస్తున్నాయ్. గాడ్పులు యీ చెవిలో నుంచి ఆ చెవిలోకి కొడుతున్నాయి.

'గొడుగుపట్టు కెళ్లారా, ఎండ వడ గొడుతుంది' అని అమ్మా నాన్నా పట్టుపడితే 'ఇంక తప్ప దురా బాబూ! గొడుగు తీసుకు పోకపోతే ప్రయాణం కూడ పోతుందేమో'నని యిష్టం లేక పోయినా గొడుగు పుచ్చుకుని బయల్దేరాను.

అప్పుడే టైం తొమ్మిదిం బావయింది. 'మెయిల్' దొరక దేమో నని సైకిల్ రిక్షామీద త్వర త్వరగా స్టేషన్ చేరుకున్నాను. తీరా నేను అంత ఖంగారుపడి రిక్షాయెక్కి వెడితే, మెయిలు దాని అనుమాయితి ప్రకారం 'అర గంట లేటు' అన్నారు.

ఏమీ తోచక అలా 'హిగ్గిన్ బాదమ్స్' వైపు వెళ్ళాను. అవాళే వచ్చిన 'ఆంధ్రపత్రిక' కనుపించింది. కాలక్షేపానికైనా ఉంటుందని నాలుగణాలు యిచ్చి పత్రిక తీసుకొన్నా.

పత్రిక చదువుతూండగానే మెయిల్ వచ్చింది. పుస్తకం మడత పెట్టి చేత్తో పట్టుకొని గొడుగు మరో చేత్తో పట్టుకొని బండిలో ఎక్కి కూర్చున్నా.

నా చేతిలో పుస్తకం చూసి ప్రక్క నున్నాయన 'బొమ్మలు చూసియిస్తా' నని తీసుకున్నాడు. బొమ్మలు చూసియిస్తా నన్న పెద్ద మనిషి, యీచివరి నుంచీ ఆచివరి వరకు చదివేస్తున్నాడు. నాకు చిరాకు పుట్టుకొచ్చింది. ఆయనతో

శ్రీ సి. హెచ్.
శ్రీరామమూర్తి

మాటలు మొదలుపెట్టాను: ఆమాట సందర్భంలోనే తేలింది — ఆయన వెళ్లేది కూడా విజయనగరమే నట. కాని ఆయన కూడా నామాదిరి గానే విజయనగరం వెళ్లటం యిదే ప్రథమమట. ఏమయితే నేం-ఒకరి కొకరు సహాయంగా ఉండొచ్చును కదా అనుకొన్నాను.

విజయనగరం స్టేషను వచ్చింది. మే మిద్దరం స్టేషన్లో దిగి, టిక్కట్లు యిచ్చేసి బయటకు వచ్చాము.

అలా స్టేషనులో నుంచి బయటకు అడుగు పెట్టామో లేదో బండివాళ్లు మమ్మల్ని చుట్టు ముట్టేశారు. అక్కడున్న వాళ్లల్లో ఒకడు నాకేసి చూపించి 'ఒరేయ్! ఆగొడుగు నాది' అన్నాడు తక్కిన వాళ్లతో.

అది వినేసరికి నాగుండె ఆగి పోయినంత పనయింది. తీరా స్టేషను దిగి బయటకు అడుగు పెట్టేనో లేదో, వీడిలా అంటున్నా డేమిటీ? నిక్షేపంలాంటి యీ గొడుగు తనది అంటా డేమిటి? ఈవూళ్లో వాళ్లంతా దొంగల ముఠాపమో? కొత్తగా వచ్చి వాళ్లను బెదిరించి యిలా ఎవడికి అందింది వాడు పట్టుకెళ్లి పోతా డేమో? వాళ్లంతా కలిసి నాగొడుగు లాగేసుకొంటే యింత చిన్నవాణ్ణి నేనేం చెయ్య గలను? వద్దంటున్నా అమ్మా నాన్నా గొడుగు తీసి కెళ్లమని అంటగట్టి పంపించారే, దీని దుంప తెగ! దీని మూలంగా నాకు వీళ్ల చేతుల్లో దెబ్బలు కూడా తప్పవల్లే వుందే!...పోని పాత గొడుగులే అనుకొందామా అంటే - కొత్త గొడుగు, ఈ మధ్యనే కొన్నారు ఓంటె మార్కుది ఏం చేయను? ఏమి తోచక బిక్కమొహం వేసి చూస్తున్నాను.

ఇంతలోకే యింకో బండివాడు 'ఆ ఎఱ్ఱపంచ నాది' అన్నాడు- నాతో పాటు ప్రయాణం చేసిన పెద్దమనిషి కట్టుకొన్న పంచె

చూపించి. దాంతో అంత పెద్దవాడైనా ఆయన కూడ నాకు మల్లేనే బిక్క మొహం వేసేశాడు.

నాకు మహా కోపం వచ్చింది. వాళ్లతో దెబ్బలాడదామనుకున్నా ధైర్యంచేసి. కాని అది క్రొత్తచోటు ఎంత కోపం వచ్చినా, నోటమ్మట ఒక్క మాట కూడ రాందే నేనేం చెయ్యను?

ఒకబండి వాడొచ్చి 'నాతో రండి' అని నా గొడుగు పట్టుకొని లాక్కెళ్లు తున్నాడు. దాంతో నాకు కోపం, ఏడుపు కూడ వచ్చాయి. ఇప్పుడు వాడు నన్ను ఎక్కడకు తీసుకెళ్తాడో, ఏం జేస్తాడో, అని భయం వేసింది. ఎలాగయితేనేం, మొత్తం మీద కొంచం ధైర్యం చేసి 'ఉండవోయి...' అని వాడి పట్టు విడిపించుకున్నా.

ఈలోపల ఆబండివాళ్లు తగవులాడుకోవడం మొదలెట్టారు. 'ఆగొడుగు నా' దంటే, 'ఆపెట్టె పంచ నా'దని. వాళ్లల్లో వాళ్లకే పంపకాలు కుదరలేదు కాబోలులే అనుకొన్నా. ఈ దెబ్బలాట యిలాగే పెరిగి పెరిగి, చివరికి చిన్న యుద్ధంగామారి, వాళ్లందరూ చచ్చిపోతే బాగుండుననుకొంటున్నాను.



ఇంతట్లోకే స్టేషన్ నుండి బయటకువస్తున్న మా బావ కనిపించాడు. అప్పుడే స్టేషనులో నాకోసం వెదకి వచ్చేస్తున్నాడులావుంది. మా బావను చూసే సరికి నాకు కొండంత ధైర్యం వచ్చింది; నాగొడుగూ ప్రక్కనున్నాయన పంచపోవని. 'బావోయ్' అని బిగ్గరగా పిల్చాను.

మాబావ ఎరిగి ఉన్న బండివాణ్ణి పిలిచి జట్కామీద యింటికి తీసుక వెళ్లాడు. (ఆ క్రొత్తాయనకూడా వేరే బండి మాట్లాడి కట్టించి పంపించేశాం లెండి.)

ఇంటికి వెళ్ళిన తర్వాత స్టేషన్ దగ్గర జరిగిన సంగతంతా చెప్పాను. అది విని మాఅక్క, బావ పొట్టలు చెక్కలు అయేలా నవ్వటం మొదలెట్టారు.

వాళ్లెందుకలా నవ్వుతున్నారో నాకు ఎంతకీ తెలియలేదు. తరువాత ఎప్పుడో చెప్పాడు మా బావ అసలు సంగతి. "ఆబండివాళ్లు అంతేనోయ్. రైలు దిగి వస్తున్న వాళ్లు సామాను పట్టుకొస్తుంటే వాళ్లు తప్పకుండా బండి ఎక్కుతారు గదా! వాళ్లల్లో

(౫౧-వ పేజీ చూడండి)

మూడో ప్రపంచయుద్ధం ముంచుకొస్తున్నట్టుంది. మంచూరియా మీదికి దాడితీశాయిట అమెరికన్ విమానాలు. జపాన్‌కి ఉత్తరంలో రష్యా, అమెరికా విమానాలు జుట్టుపట్లు పట్టుకున్నాయట.

సూడాన్ సంగతేదో కుదిరిందనుకుంటే మళ్ళీ మొదటికొచ్చేటట్టుంది. బ్రిటిష్ వాళ్లు సూయజ్ కాలవ ఒడ్డు విడిచిపెట్టేటట్టు లేరు.

ఆంధ్రరాష్ట్రం వచ్చేదీ కలిగుండి అయిదుకోట్ల లోటుతోపాటు లక్షతంపులు కూడా తెచ్చిపెడుతోంది. దేశంలో ఎక్కడ పను లక్కడా పేస్తున్నారట ప్రభుత్వం.

ఫైనాన్సు కమిషన్ పుణ్యమా అని రాజాజీ ప్రభుత్వాని కింకో మూడున్నర కోట్లు కొట్టుకొస్తోంది. ఇంకేం. ఆంధ్ర రాష్ట్రం పంచుకు వెళ్లిపోగా (75 లక్షల) మిగులు (మద్రాసు) రాష్ట్రానికి నాలుగు కోట్ల పాతిక మిగులు కాబోలు. విశ్వనాథంగా రూరుకోరు. లెక్కలు తవ్వి తోస్తారు.

రైళ్ళలో రద్దీ ఆట్టే తగ్గినట్టు కనపడదు కాని రాబడి తీసిపోయిందట.

క్షామానికి, ప్రాంతీయ విభేదం, పక్షపాతం లేదన్నారు రాజాజీ —నివారణకి కాబోలు.

ఆంధ్రదేశంలో విద్యుచ్ఛక్తి శాఖలో 2500 మందికి పని ఊడిపోయిందని బెజవాడ వార్త—850 మందే నంటారేం రాజాజీ!

విశ్వనాథంగారి లెక్కలు అన్యాయమంటున్నారు రాజాజీ. అన్యాయం లెక్కల్లో లేకపోతే ఎక్కడుంది?

ఇదీ వరస. వార్తలు తిరగేస్తే ఉన్న మతి కూడా పోతోంది, అసలు లోకమే మారిపోతోంది; రోజులు పారిపోతున్నాయి. పరిస్థితులు అంతుచిక్కడం లేదు. సమస్య లేమో విషమించి, గడ్డకట్టుకుపోయి తిష్టవేసు కూర్చుంటున్నాయి. ఎందుకిలా అనిపిస్తోంది? ఏదో కారణం ఉంటుంది. వార్తాపత్రికలొచ్చి కాలాన్ని అదిలించి బెదరగొట్టి దరుముతున్నాయి, మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇదే కారణమై వుంటుంది.


దేశకాల పరిస్థితులు బోధపరుచుకోవాలని నిత్యం వార్తాపత్రికలు చదువుతోంటే అంతా అయోమయంగా ఉంటుంది. రోజూ వార్తాపత్రిక చూడకపోతే తోచదు. ఇవాళ పత్రిక చదివేసి మూసేస్తే, మళ్ళీ రేపు పత్రిక తెరిచేలోగా ఎక్కడ ఏం ముంచుకుపోతుందోనని గాబరా; ముళ్ళమీద నించున్నట్టుంటుంది. ఏ కాస్తో ఆశ పుంజుకోవాలని నాయకులూ మహానాయకుల ఉపన్యాసపరంపర చూడబోతే - ఇంక యమలోకమే. పోనీ అని సినిమాలకి వెడితే అదో మాయాలోకం. రేడియో వినబోతే అసలుసంధ్యవేళ కూడా ఆవలింతలు. ఇదీ 'మాలోకం' పరిస్థితి.

తప్పు వార్తాపత్రికల్లో లేదు. ఉపన్యాసాలు శ్రావ్యంగానే ఉన్నాయి. సినిమాలూ రేడియోలూ తీరికూచుని మనల్ని రమ్మనలేదు. 'మాలోకం' తప్పు అసలే లేదు. ఇంక తిరకాసు ఎక్కడుంది? లోకంలోనే ఉండిఉంటుంది.

డాక్టరవడానికి అయిదేళ్లూ, ప్లీడరవడానికి మూడేళ్ళూ విద్యార్థుల్ని ముగ్గబెట్టుతోంటే, అధ్యాపకత్వం పరువుకి రావడానికి ఏకసాలు కాపు చాలదన్నారు రాజాజీ. మొదట కొన్నాళ్ళు పెట్టుబడి అనుకుని, కొన్ని వేలు ఖర్చు భరిస్తే, తరవాత వేలూ లక్షలూ గడించుకోవచ్చు ననుకునే వృత్తులకీ, ఎప్పటికీ నెలవారీ రెండు వందలందుకోలేని వృత్తికీ తేడా చాలా వుంటుంది. ఒక్క ఏడాదిపాటు కష్టమో నష్టమో వెయ్యి రూపాయలదాకా ఖర్చు దేకనిశ్చయుండా మానుకుంటూ గడిపి ఏనభై రూపాయల మేష్టరీలో చేరి కొందరైనా బియ్యేలు సుఖపడుతున్నారని కన్నుకుడుతోంది కాబోలు, ప్రభుత్వానికి. ఇప్పటికీ దేశంలో టీచర్లు జొత్తిగా తక్కువైపోయినా రనుకుంటూవుంటే, ఏడాది చదువుని మూడేళ్ళకి సాగదీస్తే అసలుకే ముప్పురావచ్చు.

* * *

కాకపోతే రాజాజీ కొత్తరకం సోషలిజం ఏదైనా తలపెట్టుతూ ఉండొచ్చు. వైద్యవృత్తిలో మూడేళ్ళ కోర్సు అంటూ పెట్టి ఒక కొత్తకులాన్ని సృష్టించారన్నారు అదివరలో. లాయర్లకి మూడేళ్ళే తయారీ. టీచర్ల తయారీకికూడా మూడేళ్ళ కాలేజి ఖర్చు అంటగట్టితే, అక్కడికి 'బుద్ధిజీవుల' వృత్తుల్ని సాఫుగా 'చదువు' చేసినట్టవుతుంది. ★



ప్లాస్టిక్ పైపింగ్. ఇరిగేషన్‌లో ఉపయోగానికి ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ తయారీ.

## వింత భాష

(43-వ పేజీ చూడండి)

వాళ్లు పోటీలు పడకుండా ఏసామాను ముందుగా ఏబండివాడి కంటబడితే, వాడికే ఆబేరాన్ని మిగిలిన బళ్లవాళ్లు వదిలెయ్యాలని వాళ్లల్లో వాళ్లకి ఒక ఒప్పందం వుంటుంది. అందుకనే వాళ్లు ప్రయాణీకుల చేతుల్లో వున్న సామానును బట్టి, 'ఆబేరం నాది' అంటారు. అంతే కానీ, వాళ్లు దొంగల ముఠా కాదు: నీ వినాయకుడి గొడుగు వాళ్లు దోచుకోనూ దోచుకోరు," అన్నాడు మా బావ.

"ఇదేం వింతభాషరా బాబూ!" అనుకొన్నాను నాలో నేను. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras